

లాభాలు తెస్తున్న 'లాజిస్టిక్స్'
నష్టాల కొట్టుమిట్లాడుతూ సాగుతున్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ బూస్ట్ నిచ్చింది. అధికారుల నిర్ణయంతో సంస్థను నష్టాలనుంచి గట్టెక్కించే ఆదాయం వనరుగా మారింది. 4లో▸



'యోగ'మే.. మహా 'భాగ్యం'
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఆసనాలు వేశారు. 5లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.7 /28.4

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల వరకు తగ్గుతాయి. వేడి, ఉక్క బోత కూడా తగ్గుతుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'డైస్' మెరిట్ లిస్ట్ విడుదల


'డైస్' సేవలు అందేదెప్పుడో.!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్‌చైన్‌గేట్: 'డైస్' సేవలు అందేదెప్పుడో శీర్షికన ఈనెల 20 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వివిధ కేటగిరీల వారీగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు డాక్టర్ ధనరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టు, రిజెక్టెడ్ లిస్టు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖా అధికారి, నిర్మల్ కార్యాలయములో nirmal.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలు, ధ్రువ పత్రాలతో ఈ నెల 22 సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సొంతగూటికి 'ఏలేటి' అనుచరుడు


చిన్నుని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు నాందేడపు చిన్ను బీజేపీని వీడి సొంత గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీతో సాధ్యమని కాంగ్రెస్‌లో కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తు మల్లేశ్, అర్జుమన్ అలీ, జునైద్ మెమన్, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌పై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలోని వైద్యాధికారులకు, పర్యవేక్షక సిబ్బందికి మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌పై వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కాన్సల్టెంట్ డాక్టర్ హెజ్ హిలార్సన్ బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైలేరియా వ్యాధికి కారణం, నివారణ, నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, చికిత్స విధానం గురించి వివరించారు. సమావేశంలో జాతీయ కీటక జనిత కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రాజారమేష్ , సీహెచ్‌వో గిరిబాబు, ఎస్‌యూవో వేణురావు, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, జిల్లాలోని వైద్యాధికారులు ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం


బస్తీ దవాఖానా ప్రారంభిస్తున్న విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ప్రారంభిస్తుందని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. భైంసాలోని సంతోష్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను డీఎంహెచ్‌వో ధనరాజ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం పట్టణంలో మార్కండేయ గుడి నిర్మాణం కోసం రూ.40 లక్షల ప్రొసీడింగ్ కాపీని పద్మశాలి సంఘం నాయకులకు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సుదర్శన్ పటేల్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఫారూక్, నాయకులు కృష్ణ, ఆసిఫ్, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

వీరులారా వందనం !


మంచిర్యాల పట్టణం రాళ్లవాగు సమీపంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం



ఈమె పేరు లక్ష్మి. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామం. ఆమె కొడుకు నాయకిని నగేశ్ 23ఏళ్ల వయస్సులో తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశాడు. ఓయూ క్యాంపస్‌లో పీజీ చేసిన అతడు 2011లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జాప్యాన్ని నిరసిస్తూ ఓ లేఖ రాసి మంచిర్యాల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివరలో రైలుకు ఎదురెళ్లి చనిపోయాడు. ఆ సమయంలో ఓయూ క్యాంపస్‌తోపాటు పెద్దయెత్తున ఉద్యమం ఎగిసింది. మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య, తదితరులు వచ్చి నివాళులు అర్పించి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రూ.లక్ష సాయం చేశారు. అంతకుమించి ఎటువంటి సాయం అందలేదని తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

అమరవీరుల ఆకాంక్షలు నెరవేరలే..



తెలంగాణ వస్తే బతుకులు బాగుపడుతా యని అనేకమంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే ఇప్పటికీ వారి ఆకాంక్షలు నెరవేరలే. కుటుంబ, గడీల పాలనలో సామాజిక న్యాయం జరగలేదు. ప్రజలు కోరుకున్న తెలంగాణ రాలేదు. నేటికీ రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

– దుర్గం భాస్కర్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

- రాష్ట్ర సాధనకు అనేకమంది ఆత్మబలిదానం
- కొందరికే అందిన ప్రభుత్వ సాయం
- ఉమ్మడి జిల్లాలో 27మందికి రూ.పది లక్షల సాయం
- ఇంకా అనేక కుటుంబాలకు ఎదురుచూపులే..
- నేడు అమరుల సన్మరణ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంతోమంది ఆత్మబలిదానాలతో నేటి స్వరాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయి పదో ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా నేడు గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. అమరుల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎంతో మంది తెలంగాణ ఏర్పాటును కాంక్షిస్తూ ఆత్మబలిదానం చేశారు. వీరిలో కొందరికి మాత్రమే ప్రభుత్వం నుంచి సాయం అందింది. మరికొందరికి స్థానిక నాయకులు, రాజకీయ పార్టీల నుంచి సాయం అందింది. ఇప్పటికీ తమ కుటుంబాలకు న్యాయం జరగలేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న వారిలో 27మందికి రూ.పది లక్షల చొప్పున ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. కొందరికి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ కొంతమంది అమరుల కుటుంబాలకు ఎటువంటి సాయం అందలేదు. బెల్లంపల్లిలో తెలంగాణ ఉద్యమంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో పిన్న రాజ్‌కుమార్ అనే వ్యక్తి భార్య పద్మకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారు. ప్రస్తుతం మంచిర్యాల ఆర్టీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తోంది. ప్రభుత్వ పరంగా రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందజేశారు.

- 2012లో ఆదిలాబాద్‌కు చెందిన సంతోష్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతుండేవాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఓయూ క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజీ ముందే ఓ చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణత్యాగం చేశాడు. ఆత్మహత్యతో ఓయూ అట్టుడికింది. అమరుని కుటుంబానికి రూ.పది లక్షల సాయం అందింది.
- 2013లో ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడకు చెందిన పుంద్రువార్ నర్సింగ్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. అప్పట్లో ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో రాస్తారోకో చేశారు. ఈయన కుటుంబంలో ఒకరి ఉద్యోగం, రూ.పది లక్షల సాయం అందింది.

అమరుల కుటుంబాలకు అందని సాయం

- బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్, రాజు అనే ఇద్దరు యువకులు కూడా స్వరాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్నారు. కానీ వీరి ఆత్మహత్య కేసు పోలీసు రికార్డుల్లో నమోదు కాలేదు. అందువల్ల ఇరువురు బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందలేదు. ఉద్యోగ అవకాశం కల్పించలేదు.
- చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామానికి చెందిన ముత్యాల రాజగౌడ్, సుబ్బారాంపల్లి గ్రామానికి చెందిన బిల్కి మహేష్ ప్రాణత్యాగం చేశారు.

'న్యూ'ట్రి గార్డెన్స్!


కొలాంగూడ న్యూట్రి గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న కలెక్టర్, డీఆర్డీవో(ఫైల్)

- ఇంటింటా ఏర్పాటుకు డీఆర్డీఏ కసరత్తు
- పిల్లలు, మహిళల్లో పోషకాల పెంపే లక్ష్యం
- ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పెంపకం

కడెం: పిల్లలు, మహిళల్లో పోషకాల లోపం నివారించేందుకు గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కిచెన్, న్యూట్రీ గార్డెన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు, చిన్నారుల్లో రక్తహీనతను అరికట్టేందుకు, సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలను ప్రతి ఒక్కరూ ఆహారంగా తీసుకునేందుకు జిల్లాలో ప్రతీ ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు డీఆర్డీఏ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కలెక్టర్ దత్తత గ్రామమైన కడెం మండలం పెద్దూర్ కొలాంగూడలో ఇటీవలే కలెక్టర్ వరుణ్‌రెడ్డి న్యూట్రీ గార్డెన్‌లో విత్తనాలు వేసి, మొక్కలు నాటారు.

ప్రతీ ఇంట్లో కూరగాయల తోట

ఇంటింటా కూరగాయలు సాగు చేసేలా కిచెన్ గార్డెన్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఐకేపీ, ఉపాధిహామీ, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో న్యూట్రి గార్డెన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణం మినహా.. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో, ప్రతీ ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 926 అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, స్థలాలు లేనిచోట కుండీలు, డబ్బాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పోషకాహారమే లక్ష్యంగా..

పిల్లలు, మహిళలకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న కిచెన్ గార్డెన్లలో తెలబచ్చలి, ఎర్ర బచ్చలి, మెంతి, చుక్కకూర, పాలకూర తదితర ఆకు కూరలు, క్యారెట్, బీట్‌రూట్, మునగా, తీగజాతి రకాలు బీరకాయ, సోరకాయ, చిక్కుడు, టమాటా, బెండకాయ, మిరపకాయ, ముల్లంగి, దుంపలు, తదితర కూరగాయలను సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటికి సేంద్రియ ఎరువులను వినియోగించి, పది రోజుల్లో నాటుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటింటా కిచెన్ గార్డెన్



మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా.. జిల్లాలోని ప్రతీ ఇంట్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నాం. ఈజీఎస్, ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది ఉద్యమంలా ప్రతీ గ్రామంలో పనిచేస్తున్నారు. 70 శాతం వరకు గార్డెన్‌లు ఏర్పాటు చేశాం. అందరి సహకారంతో అన్ని గ్రామాల్లో, కార్యాలయాల వద్ద కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేస్తాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

రక్తహీనత అరికట్టేందుకే



మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉంది. రక్తహీనతతో చిన్నారులు, మహిళలు మరణిస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసీ గూడేల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. రక్తహీనత సమస్యను అరికట్టేందుకు మహిళలు, చిన్నారులు పోషకాహారం తీసుకునేలా న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్‌కు శ్రీకారం చుట్టాం. త్వరలోనే సత్ఫలితాలు వస్తాయి.

– వరుణ్‌రెడ్డి, కలెక్టర్

ఆలయాలకు మహర్దశ


అడెల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- కలెక్టర వరుణ్‌రెడ్డి
- అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో పూజలు
- ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

సారంగాపూర్: తెలంగాణలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల పునర్నిర్మాణం, దీపధూప నైవేద్యాలకు నిధులు ఇస్తోందని వివరించారు. రూ.10 కోట్లతో అడెల్లి ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందుతోపాటు ఆలయ సిబ్బంది రమణారావు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మల సేవలను ప్రశంసిస్తూ వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుపతిరెడ్డి, సర్పంచ్ సుచరిత, ఏపీవో లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ పద్మ, డీఆర్వో శ్రీదేవి, పంచాయతీ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గండి రామన్న దత్తసాయి ఆలయంలో..

నిర్మల్‌టౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్తసాయి ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పచ్చదనం కనువిందు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఆమెడ శ్రీధర్, పూదరి నరహరి, మహేందర్‌యాదవ్, కృష్ణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాసరలో ఆధ్యాత్మిక దినోత్సవం

భైంసా: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాసర దేవస్థానంలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరై దేవస్థానానికి విరాళాలు అందించిన దాతలను సన్మానించారు. సర్పంచ్ లక్ష్మణ్, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్, ఆలయ ఏఈవో, అర్చకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించాలి


సమావేశంలో మాట్లాడతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను శనివారంలోగా పోలీస్, రెవెన్యూ శాఖ సమన్వయంతో గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహక చర్యల్లో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సమీకృత కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్ శాఖలతో సమీక్ష నిర్వహించారు. మొబైల్ నెట్‌వర్క్ రాని గ్రామాల సమాచారాన్ని తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి గత అనుభవాల ఆధారంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని తెలిపారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఫారం–6, 8 పెండింగ్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మకంగా పోలింగ్ స్టేషన్‌ను గుర్తించి నిఘా ఏర్పాటుతోపాటు ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో పోలీస్ అధికారులను నియమించాలన్నారు.

సార్ జీవితం తెలంగాణకు అంకితం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్‌టౌన్: తెలంగాణ కోసం ప్రొఫెసర్ జయశంకర్‌సార్ తన జీవితాన్ని అంకితం చేశారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో జయశంకర్ సార్ 12వ వర్ధంతి నిర్వహించారు. సార్ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐకేరెడ్డి మాట్లాడుతూ... జయశంకర్ సార్ తెలంగాణే ఊపిరిగా శ్వాస ఉన్నంత వరకు ఉద్యమించారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో కేసీఆర్‌కు వెన్నంటి ఉండి రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సార్ కల అని, సీఎం కేసీఆర్ ఆ కలను నిజం చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, నాయకులు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'రూ.లక్ష'కు పోటెత్తిన దరఖాస్తులు

- జిల్లా వ్యాప్తంగా 14,521 మంది దరఖాస్తు
- తహసీల్దార్ కార్యాలయాల వద్ద మంగళవారం రాత్రి వరకు పడిగాపులు
- గడువు ముగియడంతో అర్హుల్లో నిరాశ


ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్న దృశ్యం(ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ కుల వృత్తులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించింది. ఇందుకు ఈనెల మొదటి వారంలో దరఖాస్తులు ఆహ్వానించింది. 15 కులాలకు చెందిన వారికి మాత్రమే సాయం అందిస్తామని ప్రకటించింది. దీంతో వివిధ కులవృత్తుల వారు ప్రభుత్వ సాయం కోసం పోటీ పడ్డారు. కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చి పడ్డాయి. దరఖాస్తు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ఆన్‌లైన్ సర్వర్ సమస్యతో ధ్రువపత్రాలు సకాలంలో జారీ కాలేదు. దీంతో కులవృత్తిదారులకు, రెవెన్యూ సిబ్బందికి మధ్య ప్రతిరోజూ వాగ్వాదం జరిగింది. మొత్తానికి మంగళవారం దరఖాస్తులకు గడువు ముగిసింది. రాత్రి 8 గంటల వరకు కూడా పలువురు తహసీల్దార్, మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు.

14,521 దరఖాస్తులు..

జిల్లా వ్యాప్తంగా 18 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 14,521 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం రాత్రి తర్వాత కూడా ఆయా తహసీల్దార్ కార్యాలయ పరిధిలో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. బుధవారం గడువు పెంపుపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. గడువు పెంచేది లేదని మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించారు. దీంతో అర్హత ఉండి సర్టిఫికెట్ లేక దరఖాస్తు చేసుకోలేనివారు నిరాశ చెందుతున్నారు.

కులవృత్తుల వారికే మొదటి ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం 15 బీసీ ఉప కులాల కోసం ప్రకటించిన లక్ష రూపాయల సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కులవృత్తుల వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం ఆయా దరఖాస్తు ప్రతులను ఎంపీడీవో, పురపాలక సంఘాల కమిషనర్లకు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. పల్లెల్లోని దరఖాస్తులను ఎంపీడీవో, మున్సిపాలిటీల్లోని దరఖాస్తులను కమిషనర్లు పరిశీలించి జిల్లా కమిటీకి నివేదిస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తుందని వెల్లడించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తర్వాత అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తారు.

మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు..

నిర్మల్ అర్బన్	1,449
భైంసా	1,204
సారంగాపూర్	1,088
కుభీర్	964
లోకేశ్వరం	868
నిర్మల్ రూరల్	814
మామడ	792
కడెం పెద్దూర్	721
లక్ష్మణచాంద	705
ముథోల్	705
భైంసా అర్బన్	682
ఖానాపూర్	626
కుంటాల	598
తానూర్	537
సోన్	528
నర్సాపూర్(జి)	446
దిలావర్‌పూర్	435
ఖానాపూర్ అర్బన్	432
దస్తురాబాద్	412
బాసర	290
పెంబి	225

ఇంటింటా గోబర్ గ్యాస్ ప్లాంటు ఉండాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి


గోబర్‌గ్యాస్ ప్లాంటును పరిశీలిస్తున్న కలెక్టర్

సారంగాపూర్: ప్రకృతి ప్రసాదించిన ఇంధన వనరులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రతీ ఇంట్లో గోబర్‌గ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయించుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. అడెల్లి మహాపోచమ్మ ఆలయం సమీపంలోని అడెల్లి నందనవనంలో ఉపాధిహామీ పథకంలో నిర్మిస్తున్న బయోగ్యాస్(గోబర్ గ్యాస్ ప్లాంటు) పనులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోగ్యాస్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఖర్చు లేకుండానే వంటచేసుకోవడంతోపాటు ప్లాంటులో వేసిన పశువుల పేడను ఎరువుగా ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన ఇంధన వనరులను సద్వినియోగం చేసుకునేందుకు గోబర్‌గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్లాంటు నిర్మిస్తున్న మేస్త్రీ చిరంజీవితో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ సుచరిత, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, డీఆర్వో శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మామడ: ఆన్‌లైన్ మోసాలపై బ్యాంకు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నాబార్డు డీడీఎం వీరభద్రుడు సూచించారు. మండలంలోని కొరిటికల్ గ్రామంలో కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవిలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంట రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు ఏజీఎం భీంరావ్, ఎఫ్ఎల్‌సీ మచ్చేంద‌ర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్నారెడ్డి, బాపురెడ్డి, సీఈవో గంగారాం, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే చర్యలు

నిర్మల్‌టౌన్: ప్రైవేట్ బస్సుల యజమానులు పరిమితికి నుంచి ప్రయాణికులను చేరవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎంవీఐ హరీంద్రకుమార్ హెచ్చరించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని 44 జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సును సీజ్ చేసి డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

ముథోల్: మండలంలోని తరోడా గ్రామ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. మృతుని వయస్సు 31 సంవత్సరాలు ఉంటాయని, అతనికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియరాలేదన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోర్టుకు హాజరైన మాజీ ఎంపీ


హాజరైన రాథోడ్ రమేశ్, నాయకులు

ఖానాపూర్: కడెం మండల కేంద్రంలో గతేడాది రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో పాటు 22 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై మాజీ ఎంపీతో పాటు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన నాయకులు బుధవారం ఖానాపూర్ కోర్టుకు హాజరయ్యారు. హాజరైన వారిలో నాయకులు ధర్మాజి కిష్టయ్య, పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, తలారి రాజేందర్, పొద్దుటూరి గోపాల్‌రెడ్డి, అమరవేణి రవీందర్‌గౌడ్, దేశాయి రాము, వెంకటస్వామి, లక్ష్మణ్, వెంకన్న, రమేశ్, మోహన్‌నాయక్, భాస్కర్, భీమన్న, శ్రీనివాస్, సంజీవ్, రవి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, రాజేశ్వర్, రాజేశం, పందిరి మోహన్, తదితరులు ఉన్నారు.

ఎంపీ పీఏతో పాటు పలువురిపై అట్రాసిటీ కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ పీఏ నగేష్‌తో పాటు పలువురిపై మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. మావల మండలంలోని రాంనగర్‌కు చెందిన పట్టాడే రాజుకు బట్టిసావర్‌గాం శివారులో సర్వే నంబర్ 16లో లే ఆవుట్ వేశారు. పనులు కొనసాగుతుండగా ఎంపీ పీఏ సోదరుడు సురేశ్ అక్కడికి వెళ్లి బోర్డు ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. రాజుకు ఎంపీ పీఏ సోదరుడు సురేష్‌ల మధ్య వాగ్వివాదం జరిగింది. సురేష్ విషయాన్ని నగేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కొంతమందితో కలిసి అక్కడి వెళ్లారు. మరణాయుధాలతో దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరుతో దూషించారని రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లాభాలు తెస్తున్న 'లాజిస్టిక్స్'

2020 జూన్ 19 నుంచి 2023 జూన్ 19 వరకు డిపోలవారీగా ఆదాయం

డిపో	పార్సిల్స్	సమకూరిన ఆదాయం
మంచిర్యాల	2,48,719	రూ.2,78,30,941
ఆదిలాబాద్	1,34,003	రూ.1,50,17,333
నిర్మల్	1,31,155	రూ.1,34,94,133
ఆసిఫాబాద్	85,905	రూ.1,05,47,853
భైంసా	39,492	రూ.51,96,256
ఉట్నూర్	11,112	రూ.9,65,805
మొత్తం	6,50,386	రూ.7,30,52,321

- ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ
- వేగంగా పార్శిల్స్ చేరవేత
- సేవలు ప్రారంభించి మూడేళ్లు



ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ లాజిస్టిక్స్ బుకింగ్ కార్యాలయం

ఆదిలాబాద్: నష్టాల ఒడిదుడుకుల మధ్య ముందుకు సాగుతున్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ బూస్ట్ నిచ్చింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ప్రజా రవాణా సంస్థ పలు కారణాల చేత నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఆర్టీసీని నష్టాలనుంచి గట్టెక్కించి లాభాలబాట పట్టేలా సంస్థ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మంచి ఆదాయం వనరుగా మారింది. 2020 జూన్ 19న ప్రారంభమైన ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కథనం.

క్విక్ అండ్ సేఫ్..

ఆర్టీసీ కార్గో, పార్శిల్ సర్వీస్ ద్వారా చాలా వేగంగా సేవలు అందుతుండడంతో వినియోగదారులు లాజిస్టిక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ కొరియర్ సంస్థల ద్వారా పార్సిల్ గమ్యస్థానానికి చేరుకోవాలంటే 24 నుంచి 48 గంటల సమయం పడుతుంది. ప్రజారవాణాసంస్థ ఆర్టీసీకి 80 శాతానికి పైగా ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉండడంతో కార్గో సేవలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఈ సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని ఆర్టీసీ కార్గో ద్వారా గంటల వ్యవధిలోనే పార్శిల్స్ గమ్యస్థానానికి చేరుకుంటున్నాయి. అంతేకాకుండా వినియోగదారుల నమ్మకాన్ని నిలబెడుతూ వారు అందించిన పార్శిళ్లు, కవర్లను సురక్షితంగా చేరవేస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆర్టీసీ సంస్థ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

అందుబాటు ధరల్లో..

ఆర్టీసీలో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. వారికి అందుబాటు ధరల్లో కార్గో సేవలను అందజేస్తే పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అధికారులు తక్కువ ఛార్జీలను తీసుకోవాలని నిర్ణయించారు. ప్రైవేట్ కార్గో సంస్థల కన్నా తమ సేవలను తక్కువ ధరలకు అందిస్తామని విస్తృత ప్రచారం చేశారు. దీనికి అనుగుణంగానే చార్జీలు తీసుకుంటున్నారు.

ఉపాధినందిస్తూ.. విస్తృతం చేస్తూ

కార్గో సేవలను అన్ని మండలాలకు విస్తరించడంలో భాగంగా సర్వీస్ ఏజెంట్లను నియమించారు. మండల కేంద్రాల్లో కమీషన్ ప్రాతిపదికన ప్రైవేట్ ఏజెంట్లను నియమించారు. లాజిస్టిక్స్ కమీషన్ ఏజెంట్లకు పార్సిల్ బుకింగ్స్ మీద 12 శాతం, పార్శిల్ రిసీవింగ్ మీద ఒక్కోదానిపై పది రూపాయల కమీషన్ చెల్లిస్తున్నారు. దీంతో సేవలు క్షేత్రస్థాయిలో అందుతుండడంతో పాటు పలువురు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. కమీషన్ ఏజెంట్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్శిళ్లను వినియోగదారులకు అందజేయడం, తమ ప్రాంతాల నుంచి పార్శిళ్లను బుక్ చేయడం ద్వారా రెండు రకాలుగా ఆదాయం పొందుతున్నారు. రీజియన్ పరిధిలో 30 లాజిస్టిక్స్ ఏజెన్సీలు ఉండగా, 4 ఆర్టీసీ బుకింగ్ కార్యాలయాలు ఉన్నాయి.

రూ.7.30 కోట్ల ఆదాయం

లాజిస్టిక్స్ ద్వారా అందిస్తున్న సేవలతో ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. సగటున రోజుకు ఎనిమిది వందల వరకు బుకింగ్స్ జరుగుతుండగా, లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తోంది. అత్యధికంగా మంచిర్యాల డిపో పరిధిలో 2.48 లక్షల పార్శిళ్లు బుక్ చేయగా రూ.2.78 లక్షల ఆదాయం వచ్చింది. రీజియన్ వ్యాప్తంగా ఇప్పటివరకు 6,50,386 పార్శిళ్లు బుక్ చేయగా రూ.7.30 కోట్ల ఆదాయం సమకూరింది.

కాలానుగుణం.. నిత్య నూతనం

- పార్శిళ్లు, కవర్లు, సరుకు రవాణా చేయడమే కాకుండా ప్రజలను ఆకట్టుకునేలా వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం, రాయితీలు ప్రకటించడం, ప్రత్యేక సందర్భాల్లో పలు ఆఫర్లు ఇవ్వడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను అందించడం ద్వారా రాఖీ సమయంలో పెద్ద ఎత్తున ఆదాయం వచ్చింది.
- **మేడారం మొక్కులు** : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో జాతర వరకూ ప్రయాణించలేని భక్తులు మొక్కులు చెల్లించడానికి ఆర్టీసీ కార్గో సేవల ద్వారా అవకాశం కల్పించారు. అమ్మవార్లకు బంగారం (బెల్లం) సమర్పించడానికి కార్గో కౌంటర్ల ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించారు.
- **రాములోరి తలంబ్రాలు:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించలేని, భద్రాచలానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం రాములోరి తలంబ్రాలను భక్తులకు అందజేశారు. రూ.116 చెల్లిస్తే తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చారు.
- **ధాన్య సేకరణ:** రైతుల పంట ఉత్పత్తులను కల్లాల నుంచి నేరుగా మార్కెట్‌కు కార్గో ద్వారా అతి తక్కువ ఖర్చుతో రవాణా చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా రైతులకు రవాణా సులభం అవ్వడమే కాకుండా నేరుగా మార్కెట్‌కు తరలించడం వలన గిట్టుబాటు ధర లభ్యమైంది.
- **హోండెలివరీ సేవలు:** మొదట్లో పార్శిల్, కొరియర్ బుక్ చేయాలంటే బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా బుకింగ్ చేయాల్సి ఉండేది. అంతేకాకుండా బస్టాండ్‌కు వచ్చి సంబంధిత కవర్లను తీసుకోవాల్సి వచ్చేది. అయితే ప్రజలకు సేవలను మరింతగా చేరువ చేసేందుకు హోమ్ డెలివరీ సేవలను సైతం కార్గో ప్రారంభించింది. ఎంపిక చేసిన పట్టణ ప్రాంతాల్లో దీని ద్వారా వస్తువులను ఇంటివద్దకు వెళ్లి పికప్ చేసుకోవడం, డెలివరీ చేయడం లాంటి సేవలు అందిస్తున్నారు.
- **బంగినపల్లి మామిడి:** వేసవి కాలంలో ఎంతో రుచికరమైన బంగినపల్లి మామిడి పళ్లను బుక్ చేసుకున్నవారికి చేరవేశారు.

సురక్షితమైన సేవలు..



ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చయ్యేవి. మళ్లీ పార్శిల్ సకాలంలో చేరుతుందో లేదోనని ఎదురుచూడాల్సి వచ్చేది. ఆర్టీసీ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ సేవలు చాలా మెరుగ్గా అందజేస్తున్నారు. పార్శిళ్లను కేవలం 24 గంటల్లోనే సురక్షితంగా చేరవేస్తున్నారు. తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందిస్తున్నారు.
– రఘు, ఖానాపూర్, ఆదిలాబాద్

సేవలు మరింత విస్తృతం



ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను ప్రజలు ఆదరిస్తున్నారు. ప్రతి సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. సురక్షితంగా పార్శిల్ కవర్లను గమ్యస్థానాలకు చేరవేస్తుండడంతో ప్రజలు నమ్మకంతో ముందుకు వస్తున్నారు. త్వరలో గ్రామాల్లోనూ హోమ్ డెలివరీ సేవలు ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సేవలు సైతం ప్రారంభమైతే లాజిస్టిక్స్ సేవలు మరింత విస్తృతం అవుతాయి.
– బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, లాజిస్టిక్స్, ఆదిలాబాద్ రీజియన్

నకిలీనోటుతో వృద్ధురాలికి టోకరా


అసలు, నకిలీ నోటు చూపుతున్న స్థానికులు

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కూరగాయలు విక్రయిస్తున్న వృద్ధురాలు కీర్తి పోషవ్వకు గుర్తు తెలియని వ్యక్తి రూ.200ల నకిలీ నోటు ఇచ్చి టోకరా వేసిన ఉదంతం బుధవారం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం కూరగాయల కోసం వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి రూ.200ల నోటు ఇచ్చి రూ.50ల కూరగాయలు కొనుగోలు చేసి మరో రూ.150 తీసుకెళ్లాడని తెలిపింది. తన వద్దకు కూరగాయల కోసం వచ్చిన మరో వ్యక్తికి ఈ నోటును ఇవ్వగా అది డమ్మీ నోటని చెప్పాడు. దీంతో వృద్ధురాలు తనను మోసం చేశాడంటూ లబోదిబోమని మొత్తుకుంది.

పెన్‌గంగ సరిహద్దులో ఇసుక నిల్వల సీజ్


సీజ్ చేసిన జేసీబీని చూపుతున్న ఏడీ

తాంసి(బోథ్): మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దున ప్రవహిస్తున్న పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వుతున్న అక్రమార్కులపై అధికారులు ఎట్టకేలకూ కొరడా ఝులిపించారు. భీంపూర్ మండలంలోని పెన్‌గంగ సరిహద్దు ప్రాంతం వెంట బుధవారం మైనింగ్ ఏడీ రవిశంకర్, అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. వడూర్ గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను గుర్తించారు. ఇసుక నిల్వలతో పాటు ఇసుక తవ్వుతున్న జేసీబీ వాహనం, రెండు బోల్ట్ యంత్రాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక విలువ రూ.17లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీ వెంట రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఆర్ఐ ఉన్నారు.

ఈదులవాడలో వృద్ధుడి హత్య


మల్లయ్య(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: వృద్ధుడిని దారుణంగా హత్య చేసిన ఘటన ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారశెట్టి మల్లయ్య (75) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంటిముందు వాకిట్లో మంచంపై పడుకున్నారు. తెల్లవారుజామున అతని కుమార్తె లూచి వాకిలి ఊడుస్తూ తండ్రిని లేపగా లేవకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పింది. అందరూ వచ్చి చూడగా అతని మెడ మీద కత్తితో కోసినట్లు ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రమేశ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తన రెండో కుమార్తె అత్తగారి తరపు వ్యక్తి గతంలో చంపుతానని బెదిరించాడని మృతుని భార్య కాంతమ్మ తెలిపింది. అతని మీద అనుమానం ఉందని చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రెండు క్వార్టర్లలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పేపర్ మిల్లుకు చెందిన రెండు క్వార్టర్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని న్యూకాలనీ ఎస్పీఎం పర్మినెంట్ కార్మికుడు మల్లేశ్ ఓఆర్టీ–341లో క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మిల్లులో పనులకు వెళ్లగా, అతని భార్య భాగ్య ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు బుధవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. ఓఆర్టీ–348లో నివాసం ఉంటున్న రవీందర్ రాత్రి విధులకు వెళ్లగా అతని భార్య సరిత తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. ఉదయం వచ్చి చూడగా తాళం వేసినట్లే ఉంది. లోనికి వెళ్లి చూడగా వెనుక తలుపు ఒక రెక్కను పూర్తిగా తొలగించి ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలోని తులం బంగారు నగలు, రూ.84వేల నగదును అపహరించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై అంజయ్య సంఘటన స్థలాలను సందర్శించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది సమీపంలోని మేకలగండి వద్ద బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన లారీ డ్రైవర్ సురేష్ (38) మృతి చెందాడు. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్తున్న లారీ టైరు పంచర్ కావడంతో డ్రైవర్ సురేష్ టైరును మార్చే పనిలో ఉన్నాడు. ఈ క్రమంలో నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న వెగనార్ కారు సురేష్‌ను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఫిర్యాదు అందాక కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

జైనథ్: మండలంలోని బెల్గాం బ్రిడ్జి వద్ద జైనథ్–బేల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బేల మండలం చప్రాల గ్రామానికి చెందిన అర్జున్, వామన్ బుధవారం బైక్‌పై ఆదిలాబాద్ నుంచి బేలకు వస్తుండగా జైనథ్‌కు చెందిన లాలారాం స్కూటీపై బేల నుంచి జైనథ్‌కు బయలుదేరాడు. బెల్గాం బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరబాద్ తరలించారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

బోథ్: బోథ్ మండలానికి చెందిన విద్యార్థులు నవోదయ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో మండల కేంద్రానికి చెందిన తూము గణపతి, లత దంపతుల కుమారుడు సాయి వైభవ్, రాథోడ్ అనిల్ కుమార్, రంజిత దంపతుల కుమారుడు రాథోడ్ లితేష్ ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

బీసీలందరికీ రూ.లక్ష సాయం వర్తింపజేయాలి

పాతమంచిర్యాల: బీసీ కులస్తులందరికీ రూ.లక్ష సాయం వర్తింజేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు బుధవారం కలెక్టరేట్‌లో ఏవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీలలో 130 కులాలు ఉన్నాయని, కేవలం 15 కులాల వారికే పథకం వర్తింపజేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బీసీలలోని అన్ని కులాల వారికి రూ.లక్ష సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మెరిసిన 'బంగారు' గూడ విద్యార్థినులు


అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

- రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో ప్రథమ బహుమతి
- విద్యార్థినులకు రూ.లక్ష నగదు.. ట్యాబ్‌లు ప్రదానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థినులు భవాని, పల్లవి, ప్రణవి, రమ్య రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఈ నెల 19నుంచి 21వరకు జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించారు. గతంలో రాష్ట్రస్థాయి మూడో బహుమతి సాధించిన ఈ పాఠశాల విద్యార్థినులు ఈసారి అగ్రస్థానంలో నిలిచారు. విత్తనాలు నాటే బూట్లు తయారు చేసి.. వీటికి పైపులు అమర్చి విత్తనాలు భూమిలో పడేలా రూపొందించారు. దీనిని ప్రదర్శించగా రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి దక్కింది. ఇందుకుగాను ప్రభుత్వం రూ.లక్ష నగదు, నలుగురికి ట్యాబ్‌లు, జ్ఞాపికలు అందజేసింది. జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి ఐదు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 70 ప్రదర్శనలు చేయగా, బంగారుగూడ విద్యార్థినుల ప్రతిభకు అవార్డు దక్కింది. డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ విద్యార్థినులను అభినందించారు.

'వాయిస్ ఫర్ బాయ్స్' సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్‌సీవో స్వరూపారాణి

జైపూర్: గురుకుల విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ బాయ్స్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కె.స్వరూపారాణి సూచించారు. మండల కేంద్రంలోని గురుకులంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంగనర్ జిల్లాల్లోని 18 గురుకులాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన వాయిస్ ఫర్ బాయ్స్ క్యాంపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, కోటపల్లి ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, స్థానిక వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు బాలభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కన్న పేగును వదులుకోలేక



లక్ష్మణచాంద(నిర్మల్): సృష్టిలో వెలకట్టలేనిది తల్లి ప్రేమ మాత్రమే. జీవి ఏదైనా సరే.. తన పిల్లల కోసం సర్వస్వం త్యాగం చేస్తుంది. మండల కేంద్రంలో ఓ వానరం పిల్ల ఏదో కారణం చేత వారం రోజుల క్రితం మృతి చెందింది. కానీ తన బిడ్డ చనిపోయిందని గుర్తించని తల్లి వానరం చేతిలో పట్టుకుని తిరుగుతోంది. ఇదే మరి తల్లి ప్రేమంటే.